సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

అభివృద్ధిని చూసి ఓటేయండి


50వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వంశీనగర్‌లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీకి సంబంధించి రోడ్లు, వంశీనగర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, సామాజిక భవనం అభివృద్ధి జరగడానికి కారణం కె.కె.రాజు అని, ఆయన చొరవతోనే విస్తృత స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగామని తెలిపారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో భానుప్రకాష్ ప్రతిభ


బంగారు పతకాలతో పుప్పాల భానుప్రకాష్

సీతంపేట: సంయుక్త భారత్ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ తొమ్మిదో ఇంటర్నేషనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో నగరంలోని సీతంపేటకు చెందిన పుప్పాల భానుప్రకాష్ అద్భుత ప్రతిభతో బంగారు పతకాలు సాధించాడు. 45 కిలోల విభాగంలో 100, 200, 400 మీటర్స్ అథ్లెటిక్స్‌లో మూడు బంగారు పతకా లు గెలుపొందాడు. సంయుక్త భారత్ ఖేల్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ అండ్ ఫౌండర్ శివ తివారి కొంగీ, పంకజ్ గొలా చేతుల మీదుగా బంగారు పతకాలు, జ్ఞాపికలను ఆయన అందు కున్నారు. ఈ పోటీల్లో వివిధ దేశాలకు చెందిన మాస్టర్స్ కేటగిరీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

విద్యార్థులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్‌లో ఎలాంటి ఫలితాలు వచ్చినా విద్యార్థులు ఎటువంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12న ఇంటర్ ఫలితాలు ప్రకటిస్తున్నట్టు బోర్డు నుంచి సమాచారం ఉందన్నారు. పరీక్షలు, మార్కులు, పాస్, ఫెయిల్ అనే అంశాలు విద్యార్థి దశలో చిన్నమెట్టు మాత్రమేనని పేర్కొన్నారు. పట్టుదల ఉంటే జీవితంలో ఎన్నో సాధించవచ్చని, కానీ కొంత మంది విద్యార్థులు ఆత్మన్యూనతా భావంతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులతో ప్రేమపూర్వకంగా మెలగాలన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ ఉదయం గణపతి పూజ , పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు పసుపు నీటితో జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన

- మీ ఆశీర్వాదమే.. నా గెలుపు
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 54వ వార్డులో ఎన్నికల ప్రచారం
- గడప గడపలో ఆత్మీయ పలకరింపు


బాపూజీనగర్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


104 ఏరియాలో జై జగన్ అంటున్న చిన్నారులను ఆప్యాయంగా ఎత్తుకున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. తమ పార్టీతోనే సంక్షేమ పాలన సాధ్యమని చెప్పారు. జీవీఎంసీ 54వ వార్డులో బుధవారం ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కార్పొరేటర్, చల్లా రజిని ఆధ్వర్యంలో 104 ఏరియా పరిధి బాపూజీనగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ఆత్మీయంగా ప్రజలను పలకరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందేలా తనను ఆశీర్వదించాలని కోరారు. ముందుగా బాపూజీనగర్ శివాలయంలో మహాశివుడికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు బాసటగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే మరింత ఉత్సాహంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని చెప్పారు. పలువురు వ్యాపారులను ఆత్మీయంగా పలకరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలని కోరుతూ ఇంటింటా కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావ్, పార్టీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, 54, 55 వార్డుల ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఆళ్ల శివగణేష్, అమర్‌రెడ్డి, అంబటి శైలేష్, దిలీప్, నమ్మి శంకర్, రాంబాబు, రవణమ్మ, అచ్యుతరావు, రమేష్, సోమేష్, పారన్న, దంతు, హనుమంతురావు, మోహన్‌రావు, సూరాడ ఎల్లాజీ, శ్రీను, హరినాథ్‌రెడ్డి. ప్రకాష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అన్నెంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కండి


కొండవాలు ప్రాంతం శాంతినగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజల సమస్యలు తెలుసుకుని వారితో మమేకం కావాలని కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో బుధవారం వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేందుకు పార్టీ కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, ఎం.సునీల్, అంబటి శైలేష్, వార్డు సీనియర్ నాయకులు బి.గోవింద్, కె.చిన్నా, ఎస్.కృష్ణ, దూది నర్సింగరావు, ఎస్.రామారావు, కె.రామారావు, కె.లావణ్య, జి.అప్పారావు, కె.శ్రీను, ఎస్.వి.ఈశ్వరరావు, దుర్గాభవాని, స్వామి నాయుడు, ఎం.వి.రమణ, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి, బొట్టా రాజు, వరలక్ష్మి, దేవి, అన్నపూర్ణ, శ్రావణి, పాపారావు, లక్ష్మణరావు, విజయలక్ష్మి, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కుల అభివృద్ధి


వివేకానంద పార్క్‌లో వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలోని వివేకానంద పార్క్, బృందావన్ పార్క్‌ల్లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మార్నింగ్ వాక్‌తోపాటు ఎన్నికల ప్రచారం చేశారు. వాకర్స్‌ను పలకరించి కొంతసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సహకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గుడ్ల అశోక్‌రెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రాయుడు శ్రీను, లంక భాస్కరరావు, కిరణ్‌రాజు, బి.గోవింద్, సదరం జ్ఞానేస్, ఆదిరెడ్డి అప్పారావు, సాయి, వార్డు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా భావనారుషి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, బొత్స ఝాన్సీ, కె.కె.రాజు

సీతంపేట: శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీతంపేటలో శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. 200 మంది పద్మశాలి దంపతులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమంచి ఆంజనేయ గురుస్వామి నేతృత్వంలో వేద మంత్రాలతో కల్యాణం జరిపించారు. ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నప్రసాద వితరణలో భక్తులకు స్వయంగా వడ్డించారు. సాయంత్రం మేళతాళాలతో శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, జి.వి.రవిరాజు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుదే రాజు, వానపల్లి లక్ష్మణకుమార్, ఉపాధ్యక్షులు బేతా అప్పారావు, ఇమంది వీర్రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియపై అధికారులకు సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్వో కె.మయూర్ అశోక్ అన్నారు. తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన పీవోలు, ఏపీవోలకు తొలి విడత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహించనున్న అధికారులకు జేసీ పలు సూచనలు చేశారు. శిక్షణ ప్రక్రియపై వారితో కాసేపు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. సందేహాలుంటే శిక్షణ శిబిరాల్లోనే నివృత్తి చేసుకోవాలని చెప్పారు.

ఆదర్శనీయుడు పూలే

గోపాలపట్నం: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. పూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఎన్ఎస్‌టీఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ వై. శ్రీనివాసరావు, ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, ప్రొఫెసర్ బి, భరత లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

కళింగవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: కన్యకాపరమేశ్వరి కళింగవైశ్య సంఘం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని కళింగవైశ్య భవనంలో బుధవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళింగవైశ్యుల సంక్షేమం, అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్లను నియమించి ప్రత్యేక స్థానం కల్పించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీకేవీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కన్యకాపరమేశ్వరి కళింగవైశ్య సంఘం అధ్యక్షులు దాలిరాజు, అద్దవరపు రవిచంద్ర, పొట్నూరి నాగరాజు, భోగి సాయిరాం, గంపలి మధుసూదన్‌రావు, సభ్యులు ప్రకాష్, ఎ.పి.రావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాభారతి ట్రస్ట్ సభ్యులు

మద్దిలపాలెం: రాష్ట్ర స్థాయి సాంఘిక నాటిక పోటీలను ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించనున్నామని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబు తెలిపారు. బుధవారం కళాభారతిలో పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 19 ఏళ్లుగా రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 40 ఎంట్రీలు వచ్చాయని తెలిపారు. వీటిలో 9 ఉత్తమ నాటికలను ప్రదర్శనకు ఎంపిక చేస్తామన్నారు. మొదటి నాలుగు రోజులు రోజుకు రెండు చొప్పున నాటికలను ప్రదర్శిస్తామన్నారు. చివరి రోజు 16న ఒక నాటిక మాత్రమే ప్రదర్శించనున్నామని వివరించారు. ఉత్తమ నాటికను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. ప్రదర్శించే ప్రతి నాటికకు రూ.13వేలు పారితోషికం ఇవ్వనున్నట్టు తెలిపారు. భోజనాలు, ఇతర ఖర్చుల కింద రూ.4వేలు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన నాటికలకు వరుసగా రూ.18వేలు, రూ.15వేలు, రూ.12 వేలు, రూ.10 వేలుతో పాటు జ్ఞాపికలు అందజేస్తామని వివరించారు. ఈ పోటీలకు నగదు బహుమతులను పైడా కౌశిక్ పేరిట అందజేస్తామన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు పైడా కృష్ణప్రసాద్, బొడ్డేటి జగత్ రాయ్, నాంచారయ్య పాల్గొన్నారు.

'సమాజం, భాష, సంస్కృతి' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి

సీతంపేట: ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన 'సమాజం, భాష, సంస్కృతి' గ్రంథావిష్కరణ సభ బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగింది. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి సిమ్మన్న చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ పుస్తకాన్ని రచయిత సిమ్మన్న సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్‌కు అంకితం చేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఈ గ్రంథం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపకరిస్తుందన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు గ్రంథ సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, కార్యదర్శి సిహెచ్.చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి

మహారాణిపేట : మాతాశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. చెంగల్రావుపేట పట్టణ ఆరోగ్య కేంద్రం, శొంఠ్యాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జ్ఞానాపురం పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మాతృ మరణాలపై యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదన్నారు. గర్భిణుల పేర్లు నమోదు చేసి వారికి వ్యాధి నిరోధక టీకాలివ్వాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. వారికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు విధిగా నిర్వహించాలని, గుండె జబ్బులున్న వారిని గుర్తించి వెంటనే రిఫరల్ ఆస్పత్రులకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శ్వేత, కేజీహెచ్ జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఏనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ జీవీ గణేష్,పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ బి.రోజారాణి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఐ.మనోరమ, త్రినాథరావు(108 సేవలు) తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు


నూతన డైరెక్టర్ గణేష్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(ఫైనాన్స్) సిహెచ్.ఎస్.ఆర్.వి. గోపాలకృష్ణ గణేష్‌ను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు బుధవారం ఆయనను ఉక్కు పరిపాలన భవనంలో కలిసి, సత్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, దాలినాయుడు, జి.అప్పలరాజు, పిట్టా రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కాళ్ల అప్పారావు, ఎస్.టి.అప్పారావు, చంద్రశేఖర్, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నారాయణి హోమం



సబ్బవరం: ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన క్షేత్రంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు శంఖు, చక్ర, గధా, పద్మధారియై నారాయణీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం హోమ శాలలో మహాలక్ష్మీ సమేత నారాయణి హోమం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక క్రతువులు నిర్వహిస్తున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.

రంజాన్‌కు మసీదుల ముస్తాబు

- నేడు ప్రత్యేక ప్రార్థనలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ముస్లిం కమిటీలు


విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న మర్రిపాలెం మసీదు


జాకీర్ హుస్సేన్‌నగర్‌లో ముస్తాబైన మసీదు


విద్యుత్ లైట్ల అలంకరణలో అయ్యప్పనగర్ మసీదు

మర్రిపాలెం: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ఆధ్యాత్మికంగా కొనసాగింది. మత పెద్దలు, ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేశారు. ప్రత్యేక కార్యక్రమాలతోపాటు ఇఫ్తార్, సహర్ విందులు నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం రంజాన్ పండగ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లోని మసీదులు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాల అలంకరణల్లో కనువిందు చేస్తున్నాయి. మర్రిపాలెం మస్జీద్ ఏ అల్ పతా, జాకీర్‌హుస్సేన్ నగర్ మస్జీద్ ఏ అల్ ఖదీర్ మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీటిలో వందల సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. రంజాన్ శోభతో ఈ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. గురువారం ఈ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

అయ్యప్పనగర్ మసీదులో ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని అయ్యప్పనగర్ మసీదు ఈ–నభవిలో ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) పర్వదినం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మసీదు కమిటీ అధ్యక్షుడు సిరాజుల్లా షరీఫ్ తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు మసీదు ప్రార్థనా మందిరంలో నమాజు ఉంటుందన్నారు. మాధవధార, మురళీనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, బర్మా కాలనీ, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ప్రాంతాల నుంచి 400 మందికి పైగా ముస్లింలు పాల్గొంటారని, వీరందరూ నమాజు చేసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఈద్ ముబార్ ఉంటుందని చెప్పారు. యువకులు ప్రత్యేకంగా తయారు చేసిన షర్బత్ అందరికీ పంపిణీ చేస్తామన్నారు.

దూరవిద్య విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రొగ్రాం


ఓరియంటేషన్ ప్రొగ్రాంలో పాల్గొన్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో ఇటీవల ప్రవేశాల పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రొగ్రాం బుధ వారం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. యూజీసీ సూచించిన విధంగా విద్యార్థులకు దూరవిద్యలో విద్యను అందించే విధానం, అకడమిక్ క్యాలెండర్, బోధన, అభ్యసనం, పరీక్షల విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రత్యక్ష విద్యకు సమానంగా దూరవిద్య కేంద్రంలో బోధన ఉంటుందని విద్యార్థులకు దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, సహాయ సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్, దూరవిద్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com